DVK02C227

గుమ్మడి కాయల దొంగలు బుజాలు తడుముకుంటూంటారనేది ప్రసిద్ధికెక్కినమాట. మితవాదకమ్యూనిస్టులు తాము నక్సల్‌బరీవాదుల ప్రాణరక్షకులమని ఇప్పుడలాగే గొంతు చించుకొని మరీ చాటుకుంటున్నారు.

వాస్తవంగా నక్సల్‌బరీవాదుల ప్రాణాలుతీసిన వాళ్లు కాంగ్రెసు పాలకులు కాగా వాళ్ళకు వంతపాడిన వాళ్లు యీ మితవాద కమ్యూనిస్టులు. అత్యవసర పరిస్థితిని నెలకొల్పి తన నియంతృత్వాన్ని స్థాపించు కోవాలనుకున్న ఇందిరాగాంధికి జోహుకుంలుగా ప్రవర్తించారు. కేరళలో వీరి ముఖ్యమంత్రిత్వ హయాంలో జరిగిన ఘోరహత్యలు చిత్రహింసలు ఇటీవల దేశానికే కనువిప్పుకలిగించాయి. మనరాష్ట్రంలో నక్సలైట్లనూ ఇతర రాజకీయ ప్రత్యర్థులను వందలకొలదిగా పొట్టబెట్టుకున్న వెంగళరావు మంత్రి వర్గానికి అద్యంతమూ ఖుద్దున నిలబడి రక్షకులుగా వుంటున్నదీ యీ మితవాద కమ్యూనిస్టులే. ఈ తప్పిదాలకు చెంపలు వేసుకునేదిపోయి ఇతరుల, అందులోనూ మార్క్సిస్టు పార్టీ యొక్క తప్పులెన్నడానికి ఇప్పుడు వీళ్లు సాహసిస్తున్నారు. సుందరయ్యగారు నక్సలైట్లను విమర్శిస్తూ ఇచ్చిన ప్రకటనను ప్రజాశక్తినుండి ఫొటో తీసి 'విశాలాంధ్ర'లో ప్రకటిస్తున్నారు. తాము ఏ విధంగా నక్సలైట్ల విముక్తికై పాటుబడ్డదీ పేజీలకు పేజీలు ధారావాహికంగా రాసేస్తున్నారు.

చంపుతున్న కాంగ్రెసు పాలకులకు ఒకవైపు బంట్లుగావ్యవహరిస్తూ, మరోవైపు చస్తున్నవారికిసంతాపాన్ని, వారి అనుయాయులకు కన్నీళ్లుతుడవడాన్ని వీళ్లు కొనసాగించారు. అందులోనూ కొంపలు గాలుతూంటే బొగ్గులేరుకున్న వాడి చందంగాకూడా వీరువ్యవహరించారు. 1948-51 మధ్య కమ్యూనిస్టులను అరెస్టు చేయించి విడుదల చేయడానికి కృషి చేసి జారిపోయిన వాళ్లను తమవైపుతిప్పుకునేందుకు కాంగ్రెసు నాయకులు ప్రయత్నించారు. గత ఏడెనిమిదేళ్లుగా నక్సలైట్లను ఆ విధంగా జారగొట్టి, క్షమాపణలు ఇప్పించి, తమ పార్టీలోచేర్చుకునేపాత్రను ఈమితవాదకమ్యూనిస్టులు పుచ్చుకున్నారు. ఇంకెవ్వరినీ కల్లోలప్రాంతాలని ప్రకటించినప్రాంతాల్లోకి రానీయని ప్రభుత్వం, మార్క్సిస్టుపార్టీ వారినికూడా ఆ ప్రాంతాల్లో నక్సలైట్లని నిర్బంధించి హింసించిన ప్రభుత్వం, యీ తంతు జరిపేందుకు మితవాద కమ్యూనిస్టులకు మాత్రం ఆ ప్రాంతాల్లోస్వేచ్ఛనిచ్చింది. ఖైదీలతో ఇంటర్వ్యూ లిప్పించింది. ఆ విధంగా సిగ్గులేకుండా వ్యవహరించిన యీ పార్టీ ఇప్పటికైనా ఆ హింసాకాండకు కారణమైన కాంగ్రెసు పాలకులనుఖండించకపోగా మార్క్సిస్టుపార్టీపై అభాండాలు వేయడానికి పూనుకుంటోంది. సమస్యను పక్కదారులు పట్టించి వేరస్తులను కాపాడటానికి, అందుకు తోడుగా నిల్చిన తన ద్రోహాన్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తోంది.

సమయం వచ్చింది గనుక చెప్పవలసివచ్చింది. నక్సలైట్ల విధానం తప్పని మొదటనుండీ ఖండించింది మార్క్సిస్టు పార్టీ. ఇప్పటికీ అదెలాతప్పో నిశతంగాచెప్పడానికి మార్క్సిస్టు పార్టీ ఏ మాత్రం వెనుకాడదు. అలాగే ఆ శక్తులలో కొందరు

సి.ఐ.డీ.లు, సి.ఐ.ఏ. ఏజంట్లూ చేరారని కూడా మార్క్సిస్టు పార్టీ అనేక వాస్తవాలను విదితం చేసినమాట వాస్తవం. కాని ఎన్నడూ, ఏ నక్సలైటుకూ ప్రభుత్వానికి క్షమాపణ చెప్పకోమని గాని, తోటివారికి ద్రోహం చేయమనిగాని మితవాద కమ్యూనిస్టులవలె మార్క్సిస్టుపార్టీ సలహా ఇవ్వలేదు. పైగా నక్సలైట్లపై నిర్బంధం, హత్యాకాండ ప్రారంభమైనది లగాయితూ నేటివరకు నికరంగా జంకూగొంకూలేకుండా ప్రభుత్వ దమనకాండను ఖండిస్తూవచ్చింది మార్క్సిస్టుపార్టీ, ప్రజాశక్తి పత్రికాను. మార్క్సిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా వుండిన సుందరయ్యగారు, ప్రతిపక్ష నాయకుడుగా పార్లమెంటులో వుంటూ ఎ.కె.గోపాలన్ గారు నక్సలైట్లపై నిర్బంధవిధానాన్ని హత్యాకాండను నిలుపుచేయమని హోంశాఖామంత్రిని, ప్రధాన మంత్రినీ డిమాండుచేసి వున్నారుకూడా. ఆరంభం నుండీ ప్రభుత్వ దమన కాండను మార్క్సిస్టుపార్టీ ఎలుగెత్తి ఎలా ఖండించుతూ వచ్చిందీ తెలిపేందుకు మచ్చుకు కొన్ని కత్తిరింపులను దిగువనిస్తున్నాం. అవే రివిజనిస్టుల వెకిలికూతలకు నిశితమైన సమాధానాలుగా వుండగలవు.

—సంపాదకుడు.

"గిరిజనోద్యమంపై సాగుతున్న పైశాచిక హింసాకాండను ఖండించండి"

1969 లో ప్రజాశక్తి సంపాదకీయం

శ్రీకాకుళంజిల్లాలో గత నెల చివర ఒక్కరోజున ప్రభుత్వ సాయుధ బలగాలు 12 మంది గిరిజనోద్యమ నాయకులను కార్యకర్తలను కిరాతకంగా కాల్చిచంపాయి. అంతకు పూర్వంవొక 12 మందిని కాల్చిచంపినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ 24 గురుకాక మరో ముగ్గుర్ని ప్రభుత్వ పోలీసులు వరంగల్ జిల్లా అడవుల్లో కాల్చిచంపినట్లు వార్తలు తెలుపుతున్నాయి. రెండువేల మందిని ఈ రెండు ప్రాంతాల్లో అరెస్టుచేసినట్లుకూడా తెలుస్తున్నది.

దాదాపు ఈ కాల్చివేయబడిన వారంతా తమ పోలీసు శిబిరాలపై దాడులుచేయగా పరస్పర కాల్పులు జరిగిన పర్యవసానంగా వారు చనిపోయి నట్లు ప్రభుత్వం ప్రకటనలు చేస్తోంది. ఈ ప్రకటనలన్నీ ఒకేమూసలో కల్పిత మైనట్లు ఒకేరకంగా వున్నాయి. గతంలో కనబడ్డ వారినల్లా పట్టుకవచ్చి కాల్చి చంపి, ఉభయత్రా జరిగిన కాల్పులలో కమ్యూనిస్టులు మరణించారని అల్లినకథ లనే ఈ ప్రభువ్వ ప్రకటనలు గుర్తుకు తెస్తున్నాయి. నమ్మశక్యం గానివిగా ఉన్నాయి.

ఏమైనా ఈ పైశాచక హత్యాకాండను, ఘోరమైన నిర్బంధ విధానాన్ని మేము ఖండిస్తున్నాం. ఈ హత్యాకాండకు ప్రధాన కారణం ప్రభుత్వమే నని స్పష్టం చేస్తున్నాం. గిరిజనులను రకరకాలుగా దోచుకుంటున్న వడ్డీవ్యాపారులు, భూస్వాములు, కంట్రాక్టర్లు లంచగొండి ఉద్యోగులను అన్ని విధాలా సమర్థించి ప్రభుత్వం కాపాడుతూ వచ్చింది. గిరిజనులకు పౌరసత్వ హక్కులు లేవు. వారికి అనుకూలంగా వున్న చట్టం ఏదీ అమల్లోకి రాదు. 1917 లో బ్రిటీషు ప్రభుత్వం అయినా గిరిజనుల భూములు ఇతరులు వచ్చి కొనేందుకు వీలులేదని శాసనం పెట్టింది. కాంగ్రెసు ప్రభుత్వం ఆ పరాయి పాలకుడు కల్పించిన మాత్రపు రక్షణను కూడా కల్పించడం లేదు. దోపిడీదారుల దౌర్జన్యానికి ప్రభుత్వ నిర్బంధకాండకు తప్ప శాంతి భద్రతలకు వాళ్ళు నోచుకో లేదు. ఆ హక్కులను అమలు జరుపకపోగా, వెట్టి, నాగులు, భూముల అన్యాక్రాంతం, లంచగొండితనం మొదలైనవాటిని ప్రతిఘటిస్తున్న గిరిజనోద్యమంపై ప్రభుత్వం విరుచుకుపడటం ఈ అనర్థాలన్నింటికీ కారణం.

కనుక ప్రభుత్వవిధానాన్ని, దమనకాండనూ తీవ్రంగా ఖండిస్తున్నాం. గిరిజనోద్యమం ఆందోళన చేస్తున్న కోర్కెలన్నింటినీ ప్రభుత్వం గుర్తించాలని

డిమాండు చేస్తున్నాం. నిర్బంధించిన వారందరిని విడుదలచేసి సముచిత వాతావరణాన్ని కలిగించాలని హెచ్చరిస్తున్నాం.

ఆదేసమయంలో శక్తివంతంగా మనపార్టీ అధ్వర్యాన నిర్మించబడిన గిరిజనోద్యమం గాడితప్పిన నగ్జల్‌బరీవాదుల నాయకత్వానికి తలొగ్గి దళచర్యలలోకి వ్యక్తిగత దౌర్జన్య వాదానికి దిగజారినందుకు విచారిస్తున్నాం. అనేకమంది నిస్వార్థ గిరిజన నాయకులు కామ్రేడ్ పంచాది కృష్ణమూర్తివంటి విద్యార్థులు చిత్తశుద్ధిగల యువకులు విప్లవకాంక్షతో తమ విలువైన ప్రాణాలు తృణప్రాయంగా ఒడ్డినందుకు మేము విప్లవాంజలి ఘటిస్తున్నాం. జోహారులు పలుకుతున్నాం.

... ...

— 1969 జూన్ 7వ తేదీ ప్రజాశక్తి సంపాదకీయంనుండి]

"ఉగ్రవాదుల డిటెన్షన్"

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టుకమిటీ (మార్క్సిస్టు) ఖండన

ప్రభుత్వం రాష్ట్రంలో ఉగ్రవాదులను పెద్దసంఖ్యలో అరెస్టుచేసింది' ఉగ్రవాద గ్రూపులు చెబుతున్న, అనుసరిస్తున్న విధానాలు సరైనవి కావని, తప్పని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మొదటునుండీ చెబుతోంది వీటినెదుర్కొంటోంది. అయినా తనఅభిప్రాయాలను గూర్చి ప్రచారం చేసుకునే అనుల్లంఘనీయమైన హక్కు ప్రతిఒక్క పార్టీకికలదని మాపార్టీ అభిప్రాయం. ఆ విధంగా ప్రచారం చేయడంవల్ల ప్రజలు వాటిని గూర్చి చర్చించేందుకూ ప్రజానీకం వాటిని పరీక్షించి ఆమోదించడమో లేక తిరస్కరించడమో జరిపేందుకు అవకాశం కలుగుతుంది. ప్రభుత్వం విషమ సంక్షోభంలో చిక్కుకొనివుండి తమ దివాళాకోరు ప్రజావ్యతిరేక విధానాలనే కొనసాగిస్తున్నందువల్ల ఉగ్రవాదుల సవాలును ఎదుర్కొన లేక, ప్రివెంటివ్ డెటెన్షన్, పాశవికమైన చిత్రహింసలు, నిర్బంధకాండ సాగించటం వంటి గర్హనీయమైన విధానం చేపట్టింది. రాజకీయరంగంలో సవాలు చేసి వారిని వోడించేందుకుగాను నక్సలైట్లందరిపైనా గల కేసులనుపసంహరించి, జైళ్ళనుండి విడుదల చేసిన కేరళ, పశ్చిమ బెంగాల్ ఐక్యసంఘటన ప్రభుత్వాలు సాహసోపేతమైన రాజకీయ వైఖరినవలంబిస్తుండగా, ఇక్కడ ఈ నిర్బంధవిధానం అవలంబించడం గమనించ వగియుంది.

—1969 జూలై 30వతేదీన రాష్ట్రకమిటీ చేసినప్రకటననుండి.

(ప్రజాశక్తి ఆగస్టు2, 1969)

"హత్యాకాండను తక్షణం ఆపమని సుందరయ్యగారి డిమాండ్"

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కాలంలో ఉగ్రవాదులపైన, అమాయకులైన గిరిజనులపైన చిత్రహింసలు జరుపుతూ వారిని నిలువునా హత్యచేస్తున్న అమానుష, అనాగరికమైన దారుణాన్ని భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి శ్రీ సుందరయ్యగారు కేంద్ర హోంమంత్రి శ్రీ చవాన్ దృష్టికి తెస్తూ, ఈ హత్యాకాండను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన 1969 సెప్టెంబరు 1వ తేదీన ఢిల్లీలో హోమ్‌మంత్రిని కలుసుకొని ఒక మెమొరాండం అందజేశారు.

ఆ మెమొరాండంలో ఇలావుంది:-

శ్రీకాకుళం జిల్లాలోని ఏడు తాలూకాలను కల్లోల ప్రాంతంగా ప్రకటించారు. కీలకమైన గ్రామాలు పెక్కింటిలో పోలీసు శిబిరాలు ఏర్పాటు చేశారు. పోలీసు పర్మిట్ లేకుండా అక్కడ ఏ గ్రామస్తుడూ మరో గ్రామానికి వెళ్ళటానికి వీలులేదు. పోలీసులు గ్రామ గ్రామంపైన దాడి చేస్తున్నారు. స్త్రీలను పురుషులను చావబాదుతున్నారు. ఆస్తిపాస్తులను ధ్వంసం చేస్తున్నారు. ఖులవంతాన పెద్ద పెద్ద మొత్తాలను గుంజుతున్నారు. ఇప్పటికి రెండువేలమంది జైళ్ళలో మ్రగ్గుతున్నట్లు పత్రికా వార్తలు తెలుపుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో రహస్య పోలీసు శిబిరాలు ఏర్పాటుచేశారు. అరెస్టుచేయబడిన వారందరిని వాటిల్లో చిత్రహింసపాలు జేస్తున్నారు. కొందరిని కాల్చి చంపటం జరిగింది. వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని మరికొన్ని ప్రాంతాలను కూడా ఇప్పుడు 'కల్లోలప్రాంతాలుగా' ప్రకటించాలని ఆలోచన చేస్తున్నారు.

... ...

దారుణమైన హత్యాకాండ

అరెస్టు చేసిన విషయంగాని, వారెక్కడ వున్నదిగాని వారిబంధువులకు తెలుపకుండానే, నెలల తరబడి ఏ న్యాయస్థానం ముందూ హాజరు పరచకుండానే వారిని రహస్య పోలీసు శిబిరాలలో పెట్టి చిత్రహింసలపాలు జేయటానికి వేలమందిని విచక్షణా రహితంగా అరెస్టు చేయటం అనుమతించదగినదేనా? అరెస్టు చేయబడిన వ్యక్తులను, ఖైదీలను బైటకు తీసుకువెళ్ళి కాల్చిచంపటం, పోలీసులకు నక్సలైట్లకు మధ్య పోరాటం జరిగిందనీ ఆ పోరాటంలో నగ్జలైట్లు మరణించారనీ ప్రకటించడం అనుమతించదగినదేనా? నిజంగా అలాంటి ఘర్షణలే జరిగివుంటే నక్సలైటులలోగాని, పోలీసులలోగాని ఎవ్వరూ

గాయపడకుండటం నక్సలైట్లు మాత్రమే చంపబడటం సాధ్యమేనా? ఈ విధమైన దారుణ హత్యలకు ప్రపంచంలోని ఏ భాగంలోను, ఏ నాగరిక దేశంలోను పాల్పడటంలేదు. చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని కూలదోసేందుకు నక్సలైట్లు సాయుధ పోరాటం సాగిస్తున్నారనే సాకుతో శ్రీ వెంగళరావు పోలీసులు చేస్తున్న ఈ అత్యాచారాలను సమర్థించుకొనజూస్తున్నారు. నేను ఆయనకొక విషయం గుర్తుచేయదలచాను. యుద్ధ ఖైదీలను హింసలకు గురిజేసినా, కాల్చిచంపినా; అదిఅంతర్జాతీయ న్యాయసూత్రాల ప్రకారం నేరమే. అందుకు బాధ్యులైన వారిని నేరస్థులుగా విచారించవచ్చు. తమఅదుపులోవున్న వ్యక్తిని, లేదా ఖైదీని చంపితే సాధారణ చట్టాల క్రింద ఆ అధికారిపై, లేదా ఆలాచేసిన వ్యక్తిపై హత్యానేరం ఆరోపించవలసి వుంటుంది...

...అలాంటి ఘటనలలో కొన్నింటిని దిగువ వునరుద్ఘాటిస్తా :

శ్రీయుతులు పంచాది కృష్ణమూర్తి, రామచంద్ర ప్రధాన్, చిన్నబాబు, గోపాలరావు, మరో ముగ్గురు శ్రీకాకుళంజిల్లానుండి సోంపేట రైల్వేస్టేషన్‌లో రైలుబండి దిగుచుండగా నిర్బంధించి తీసుకవెళ్ళి కాల్చి చంపివేయబడ్డారు.

శ్రీ బత్తుల వెంకటేశ్వరరావును, శ్రీ సూర్యనారాయణను మరొకరిని పోలీసులు నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారు. ఆ తరువాత వారిని కొత్తగూడెం డివిజనులోని ఒక గ్రామంలో కాల్చిచంపారు.

—హోటల్ కార్మిక సంఘ కార్యకర్త శ్రీ జగదీష్‌ను వరంగల్‌లోని శ్రీనివాసన్ హోటల్ నుండి తీసుకెళ్ళి కాల్చిచంపారు.

—శ్రీ పైలాభీముడిని శ్రీకాకుళం జిల్లా మొండెంఖల్లు గ్రామంలో అరెస్టుచేసి తీసుకవెళ్ళి కాల్చిచంపారు.

—శ్రీకాకుళం జిల్లా తులసి కొండలవద్ద పోలీసులు పదిమందిని పట్టుకొని నిలువునా కాల్చి చంపారు.

... ...

(1969 అక్టోబరు 4 వ తేదీ ప్రజాశక్తి నుండి)

"ఘోర కృత్యాలు"

... ... శ్రీకాకుళం జిల్లాలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వందమందిని చంపింది. ఎదురుబొదురుగా పోరాటం సాగిస్తుంటే పోరాటంలో మరణించటం విషయంవేరు. అలాకాకుండా దొరికిన వాళ్ళను పట్టుకపోయి నిలువునాకాల్చి చంపటం ఘోరమైన నేరం.

పట్టుబడిన వారిపైన, ప్రభుత్వ చట్టాల ప్రకారమే కేసులుపెట్టి విచారణ జరిపించి, శిక్షించటానికి పూనుకుంటే దాన్ని అర్థం చేసుకోవచ్చు. ......

పంచాది కృష్ణమూర్తిని కాల్చిచంపారు. ఆయనభార్య నిర్మలను మానభంగంజేసి, కాల్చిచంపారు. డాక్టర్ భాస్కరరావును చంపివేశారు.

(1970 ఫిబ్రవరి 26వ తేదీన హైద్రాబాద్‌లో జరిగిన భూ సంస్కరణలయాత్ర సందర్భంగా సుందరయ్యగారి ప్రసంగం 1970 మార్చి 7వ తేదీ ప్రజాశక్తినుండి.)

"ఈదమన కాండను అరికట్టాలి"

ఆంధ్రప్రదేశ్‌లో ఇటువంటి పోలీసు అఘాయిత్యాలు అనేకం 1950 రోజుల్లో జరిగాయి. ఇప్పటికి రెండుదశాబ్దాలు గడిచింది. ప్రపంచం ఎంతో ముందుకు పోయిందను కుంటున్నాం. కాని అవే అబద్ధాలు, అఘాయిత్యాలు ఈ రోజున సాగిపోతున్నా నోరు మెదపకుండా వుండటమేనా ప్రజాస్వామిక వాదుల కర్తవ్యం? పౌరసత్వహక్కులు కాలరాయబడుచున్నా కదలకపోతే ఇంకా ఈ రాక్షసత్వం విజృంభించి వికటాట్టహాసం చేయదా?

కనుక విప్లవ శక్తులు మేల్కొవాలి. ప్రజాస్వామిక వాదులు కదలాలి. ఈ కిరాతక నిర్బంధ కాండను ఎలుగెత్తి ఖండించాలి. ఈ దమనకాండకు వ్యతిరేకంగా తీవ్రమైన ప్రచారాన్ని కొనసాగించాలి. సభలద్వారా, సమావేశాలద్వారా ప్రభుత్వానికి తీవ్రమైన అసమ్మతిని తెలియజేయాలి.

ప్రభుత్వమనుసరిస్తున్న యీ దమనకాండ స్వభావాన్ని గురించి వివిధ ప్రాంతాలవారు వాస్తవ సమాచారాన్ని మన పత్రికకు ఎప్పటికప్పుడు అందజేయాలి.

... ...

(1969 డిసెంబర్ 27వ తేదీ ప్రజాశక్తి సంపాదకీయంనుండి)

"పౌరహక్కుల రక్షణకై ప్రజాతంత్రవాదులు కదలాలి"

... ...

భూస్వాముల పీడనను, దోపిడీని ప్రతిఘటించుతున్న వ్యవసాయ కార్మికులపై, రైతులపై, ప్రజానీకంపై దారుణ నిర్బంధ విధానం కొనసాగించబడుతున్నది. శ్రీకాకుళం, నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలను అణచి వేయడానికి పోలీసు క్యాంపులను నెలకొల్పడం, దాడులుచేసి ప్రజల ఆస్తులను దోచుకోవడం, పేదప్రజలపై ఘోరమైన హింసా

కాండను సాగించడం, సెక్యూరిటీ కేసులను అక్రమ కేసులను బనాయించి వారిని నానాఅవస్థల పాల్జేయడం సర్వసాధారణమై పోయింది.

వారంట్లులేకుండా అరెస్టు చేయడం, కోర్టులలో హాజరు పెట్టకుండా నిర్బంధంలోవుంచి వారాల తరబడి హింసించడం, కార్యకర్తలను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపి, సాయుధ సంఘర్షణల్లో మరణించినట్లు కాకమ్మ కథలల్లి ప్రకటనలు చేయటం యీ కాంగ్రెసు హయాంలో మామూలై పోయింది.

శ్రీకాకుళం జిల్లాలో దాదాపు వెయ్యిమందికిపైగా గిరిజన స్త్రీ,పురుషులను జైళ్ళలో నిర్బంధించడం, దాదాపు వందమందిని చిత్రహింసలకు గురిచేసి కాల్చిచంపడం జరిగింది. ప్రభుత్వ ప్రకటనల ప్రకారమే దాదాపు 30 మంది వరంగల్, ఖమ్మంజిల్లాల్లో 'అధికార' రీత్యా ఖూనీ చేయబడ్డారు. కొన్ని తాలూకాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి ప్రజలను ఘోరమైన హింసలకు గురిచేస్తున్నారు.

రాష్ట్రం మొత్తంమీద నాలుగైదు వేలమందిని సెక్యూరిటీ కేసుల్లో ఇరికించి బాధలు పెడుతున్నారు. మరికొంతమందిపై రాజకీయ కుట్ర కేసులను బనాయించారు.

ఇంక ఈ పరిస్థితుల్లో ప్రజాతంత్ర వాదులు మౌనం వహించడమంటే ప్రజాస్వామ్యానికి తమ న్యాయమైన హక్కుల కోసం నిలబడుతున్న పేదప్రజలకు ద్రోహం చేయడమే కాగలదు. రాష్ట్రప్రజలను పోలీసు రాజ్యానికి అప్పజెప్పడమే కాగలదు.

(1970 మార్చి 21వ తేదీ ప్రజాశక్తి సంపాదకీయంనుండి)

"పోలీసులచే నగ్జలైట్ నాయకుని హత్య"

ప్రధాన మంత్రికి ఎ. కె. గోపాలన్ లేఖ

కేరళలో నగ్జలైట్ నాయకుడు వర్గీస్‌ను పోలీసులు దారుణంగా హత్య గావించిన తీరును ఖండిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీ ఎ. కె. గోపాలన్ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీకి ఒక లేఖ రాశారు. ఆ లేఖలో ఇలావుంది:

... ...

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ కాకుళంజిల్లాలో, కమ్యూనిస్టు విప్లవకారులని నక్సలైట్లని పిలవబడే వారిని, పోలీసులు పట్టుకపోయి ఎంతదారుణంగా కాల్చి చంపుతున్నది, పోలీసులతో పోరాటంలో మరణించినట్లుగా వివిధంగా కట్టు

కథలల్లుతున్నదీ మీదృష్టికి తెస్తూ 1969 సెప్టెంబరులో మా పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సుందరయ్య మీకొక లేఖ వ్రాశారు. ప్రస్తుతం కేరళలో వారిపట్ల అదేవిధంగా వ్యవహరిస్తున్న వుదంతాన్ని తిరుగులేని ఆధారాలతో సహా మీదృష్టికి తీసుకురావటానికి ఈ లేఖ రాస్తున్నాను. 1968లో పూల్‌పెల్లి పోలీసుస్టేషన్‌పై జరిగిన దాడిలో నిందితుడైన వర్గీస్ అప్పటినుండి పోలీసులకు పట్టుబడలేదు. నక్సలైట్ నాయకుడిగా పేర్కొనబడుతున్న అవర్గీస్‌ను నిలువునా హత్యచేశారు. నేను మీదృష్టికి తీసుకురాగల ఇటీవల ఘటన అదే.

(1970 మార్చి 21వ తేదీ ప్రజాశక్తి నుండి)

"నానాటమితి మీరుతున్న పోలీసు దమనకాండ"

... ...

నగ్జల్‌బరీ వాదాన్ని అణచే పేరిట వేలకొలదీ అమాయకుల్ని నిర్బంధ కాండకు ప్రభుత్వం గురిచేసింది. రాష్ట్ర వ్యాపితంగా వందలకొలదీ రాజకీయ వేత్తలను నిర్బంధించి కుట్రకేసులను వారిపై బనాయించి నడుపుతోంది. ఇప్పటికీ దాదాపు రెండు వందలమందికి పైగా చేజిక్కిన వారిని, పోలీసులు పట్టుకొచ్చిన వారిని అన్ని న్యాయ సూత్రాలను అతిక్రమించి పిట్టలవలె కాల్చి చంపింది. జైళ్ళలో ఉన్న ఖైదీలను మరీ దారుణంగా రాజమండ్రి జైలులో పశువులవలె ప్రభుత్వం హింసిస్తోంది.

పోలీసు శాఖ మంత్రి ఒకవైపు నగ్జల్‌బరీవాదులను అణచిపాతేశానని ప్రగల్భాలు పలుకుతూ మరొకవైపు పోలీసుల కబంధ హస్తాన్ని మరింతగా ప్రజలపైన ప్రజల ఉద్యమాలపైన విచ్చలవిడిగా ప్రయోగిస్తున్నాడు. రాష్ట్రంలో అనేక ప్రాంతాలు కల్లోలిత ప్రాంతాలుగా, పోలీసు శిబిరాలుగా కొనసాగుతూనే వున్నాయి. నగ్జల్‌బరీవాదులను అణచే పేరిట నానాటు కమ్యూనిస్టుపార్టీ (మార్కిస్టు) కార్యకర్తలను నిర్బంధంపాలు చేయడం కూడా విచ్చలవిడిగా సాగుతోంది.

... ...

ప్రజాస్వామిక శక్తులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఈ నిర్బంధ విధానపు కబంధహస్తం మామూలు సాంప్రదయాలను,మర్యాదలను, పౌరసత్వ హక్కులను మరింతగా చుట్టుముట్టగలదని స్పష్టపడుతుంది. వెంటనే మేల్కొని ఈ చర్యలను ఖండించడం ప్రజాస్వామిక శక్తుల విధ్యుక్త ధర్మం.

(1970 అగస్టు 8వ తేదీ ప్రజాశక్తి సంపాదకీయం నుండి)

"నక్సలైట్లపై దమనకాండను తక్షణమే కట్టిపెట్టండి"

... ...

నక్సలైట్ల రాజకీయ విధానంతోను, వ్యక్తిగత దౌర్జన్యంతో గూడిన వారి కార్యకలాపాలతోను మేము తీవ్రంగా విభేదిస్తున్నాం. వాటిని దృఢ నిశ్చయంతో ఎదుర్కొంటున్నాం. అయినప్పటికీ నక్సలైట్ల రాజకీయ ప్రతిఘటనను ఎదుర్కొనేందుకు వారిని భౌతికంగా రూపుమాపదలపెట్టిన రాష్ట్రప్రభుత్వ క్రూరవిధానంపట్ల తీవ్రాందోళనను ప్రకటిస్తున్నాం. ప్రభుత్వం చేపట్టిన అనాగరికమైన దుర్మార్గపు చర్యలను ఖండిస్తున్నాం. ఈ దమనకాండను తక్షణమే కట్టిపెట్టవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నాము. రాష్ట్రంలో నక్సలైట్ కార్యకలాపాల నెదుర్కొనేందుకు వినియోగించబడిన పోలీసులు వ్యవహరిస్తున్న తీరుతెన్నులపై తక్షణమే విచారణ జరిపించవలసిందిగా కూడా డిమాండు చేస్తున్నాము.

... ...

—1969 ఆగష్టు 9 వ తేదీ ప్రజాశక్తి సంపాదకీయంనుండి

"ఉగ్రవాదులపై నిర్బంధకాండను ఖండిస్తూ పౌరహక్కుల సంఘ నాయకుల ప్రకటన"

విప్లవ రచయితల మహాసభ సందర్భంగా ఖమ్మం విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం అధ్యక్షులైన శ్రీశ్రీ, కార్యవర్గ సభ్యులైన శ్రీ కొడవటిగంటి కుటుంబరావు, శ్రీ కె. వి. రమణారెడ్డిగార్లు ఖమ్మం పట్టణానికి చెందిన కార్యవర్గ సభ్యులయిన డాక్టర్ వై. రాధాకృష్ణమూర్తి, శ్రీ కె. వి. సుబ్బారావు, శ్రీ బి. రాధాకృష్ణగార్లతో కలిసి నక్సలైటుపైన, ఉగ్రవాదులపైన సాగుతున్న నిర్బంధకాండను ఖండిస్తూ ఖమ్మం నుండి ఒక సంయుక్త ప్రకటన చేశారు.

... ...

స్త్రీల విషయంలోనైనా సహజమైన ప్రత్యేకతలను చూపడంలో ప్రభుత్వం విఫలమైనదని వారినికూడా అమానుషమైన చిత్రహింసలకు గురి

చేయడం జరుగుతోందని ముఖ్యంగా నిర్మలా కృష్ణమూర్తి విషయం ఈ సంద ర్భంలో పేర్కొన దగ్గదని ఆఖరుకు అక్రమంగా ఆమె కాల్చి చంపబడ్డదనే సమాచారం మా దృష్టికి తేబడింది.

అరెస్టు అయిన తదువరి విచారణ లేకుండా కాల్చిచంపబడటం బత్తుల వెంకటేశ్వరరావు, పంచాది కృష్ణమూర్తి, డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ మల్లికార్జున, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, గణపతి వగైరాల విషయంలో జరిగిందని సర్వత్రా వినబడుతూంది. పై సమాచారం సరియైనది కాదని ప్రభుత్వం బుకాయిస్తున్నప్పటికీ సర్వత్రా వినవస్తున్న విషయాలు నిరాధారాలని మేము భావించలేము. కొన్ని సందర్భాలలో మూకుమ్మడిగా కూడా కాల్చబడ్డారని వినవస్తున్నది.

... ...

(1970 నవంబరు 7వ తేదీ ప్రజాశక్తి నుండి)

"విచారణ లేకుండా కాల్చి చంపే ఫాసిస్టు దురంతాలు"

న్యాయా న్యాయాలతోను, కోర్టుల విచారణలతోను నిమిత్తం లేకుండా రాజకీయ కక్షతో పట్టుబడిన రాజకీయ ప్రత్యర్థులను నిలువునా కాల్చి చంపివేయడం కాంగ్రెసు పాలకులకు మామూలైపోయింది. ఇది ఫాసిజానికి దారితీయడంతప్ప మరొకటికాదు.

1948 - 51 సంవత్సరాల్లో మన ఆంధ్రప్రదేశ్‌లో సాగించిన దారుణ హత్యాకాండనే నేడు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం సాగించుతున్నది.

ఈ సమస్యను గురించి ఇటీవల శాసనమండలిలో గుంటూరు బాపనయ్య ప్రభృతులు నిలదీసి ప్రశ్నించగా హోం మంత్రి వెంగళరావు బుకాయింపుకే సిద్ధమయ్యారుగాని, కనీసం విచారించడానికి సిద్ధపడలేదంటే ఈ కాంగ్రెసు ప్రభుత్వం రాక్షసత్వంలో ఎంతగా కరుడుగట్టిపోయిందో విదిత మవుతుంది.

ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ మనరాష్ట్రంలో నక్సలైట్లు అరవైముగ్గురిని చంపారని పోలీసులకు నక్సలైట్లకు మధ్య జరిగిన ఘర్షణల్లో నూటతొమ్మిదిమంది నక్సలైట్లు మరణించారని లెక్కలు చెప్పారు. అయితే తమాషా ఏమంటే ఈ ఘర్షణల్లో పోలీసుల్లో ఒక్కరూ చావకపోవడమటుంచి కనీసం గాయపడినట్లుగా కనిపించదు.

... ...

ప్రత్యక్షంగా అనేక వేలమందినుండే గాంధీజీని చంపిన కిరాతకుడు గాడ్సేను సహితం ఈ ప్రభుత్వం లక్షల రూపాయలను ఖర్చుపెట్టి విచారణ జరిపింది. కాని ఏ నేరమూ చేసినట్లు ఖచ్చితముగా తెలియని యువకులను పట్టుపడగానే కాల్చిచంపటం, పైపెచ్చు వారు సాయుధ ఘర్షణలో మరణించినట్లు కట్టుకథలల్లి ప్రపంచాన్ని మోసంచేయడం ఘోరాతి ఘోరమైన విషయం.

... ...

చిత్తూరు సబ్ జైలులో ఖైదీలపై కాల్పులు జరపగా నారాయణ రెడ్డి అనే ఆయన అప్పటి కప్పుడే మరణించారని, మరో ముగ్గురికి బులెట్ గాయాలు తగిలాయని వచ్చిన దారుణమైన వార్త కూడా శాసనసభలో హెూం మంత్రి దృష్టికి తీసుకొని రాబడింది.

ఈ కాంగ్రెసు పాలనలో జైలులో వున్నా రక్షణ లేదని ఈ దారుణ ఘటనతో స్పష్టమవుతున్నది.

(1970 డిశంబరు 19 వ తేదీ ప్రజాశక్తి సంపాదకీయం నుండి)

నగ్జలైట్లపై హత్యాకాండను ఆదినుండీ ఖండించినది మార్క్సిస్టు పార్టీయే

కామ్రేడ్ సుందరయ్య గారి ప్రకటన

1977 జూలై 2వ తేదీన విజయవాడనుండి చేసిన సుందరయ్యగారి పత్రికాప్రకటనలో యిలావుంది :

నగ్జలైట్లు పోలసీలకూ, రాజకీయాలకు మేము వ్యతిరేకం గాబట్టి నగ్జలైట్లపై సాగుతున్న నిర్బంధవిధానాన్ని ఖండించడంలో మేము ముందుండటం లేదంటూ, ఆంధ్రలోని మితవాద కమ్యూనిస్టు నాయకులు, దేవులపల్లి వెంకటేశ్వరరావు వర్గానికి చెందిన నగ్జలైట్ గ్రూపూ మా పార్టీకి వ్యతిరేకంగా విషప్రచారాన్ని సాగించుతున్నారు.

నిజమే; నగ్జలైట్లు రాజకీయాలకు, విధానాలకు, చర్యలకూ మేము వ్యతిరేకం. తమపొరపాటు పోలసీలను, చర్యలను విడనాడ వలసిందిగా మేము వారికి విజ్ఞప్తిచేశాం. ఇటీవల కాలంలో చాలామంది నగ్జలైట్లలో కొంత పునరాలోచన ప్రారంభమైనందుకు మేము సంతోషపడుతున్నాం. వర్గ శత్రువులను వ్యక్తిగతంగా నిర్మూలించడానికి తాము వ్యతిరేకమనీ, దౌర్జన్యపూరితమైన మార్గాలను అనుసరించాలని తాము భావించడంలేదనీ, అయితే తమపై ప్రభుత్వం

సాగించుతున్న హింసాకాండ నుండి ఆత్మరక్షణకు తామూ పద్ధతులను తప్పని సరిగా అనుసరించవలసి వచ్చిందని వారు ప్రకటనలు కూడా చేశారు. నగ్జలైట్లు అనుసరించే పోలసీలకూ, సాగించుతున్న చర్యలకు మేము వ్యతిరేకమైనప్పటికీ మాపార్టీకీ, మాపార్టీ కేడరుకు వారు అపారమైన హానిని కలుగజేసినప్పటికీ, వారిపై ప్రారంభించబడిన తీవ్రనిర్బంధ విధానాన్ని ఖండించడంలో మేము మొట్టమొదటినుండీ ప్రథమశ్రేణిలోనే వుంటున్నాం. పోలీసు అత్యాచారాలకు వ్యతిరేకంగా మొట్టమొదట ఆందోళన లేవదీసింది మేమే. అలాగే వారిపైచిత్ర హింసలు జరిపి, అమానుషంగా కాల్చిచంపి, వారు సాయుధ సంఘర్షణలో మరణించినట్లు ప్రకటించడం పట్ల వ్యతిరేకంగా ఆదిలో గొంతెత్తి ప్రజాఆందో ళన ప్రారంభించింది కూడా మా పార్టీయే.

ఈ సందర్భంగా బహిరంగసభలద్వారా, ఇతర విధాలుగా ఆందోళనను చేయడంతో పాటు నేను స్వయంగానూ, మాపార్టీ తరఫున ఆ నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగావున్న శ్రీ బ్రహ్మానందరెడ్డిని, ప్రధాన మంత్రి గావున్న శ్రీమతి ఇందిరాగాంధీని, హోమ్‌మంత్రిగావున్న శ్రీ వై.బి. చవాన్‌ను 1969లోనే కలుసుకొని ఈఘోరమైన అత్యాచారాలను, హత్యలను ఆపివేయ వలసిందిగా కోరుతూ మెమోరాండంలను అందజేశాను.

ప్రజలముందు పోజులు

శ్రీమతి ఇందిరాగాంధీతో ఏకమైనదీ, ఆమెతో కలసి పనిచేసేదీ ఈ మితవాద కమ్యూనిస్టు నాయకులే. అలాగే వారు కాంగ్రెసులో కలసివున్న కేరళ ప్రభుత్వంలో భాగస్వాములు. ఆ ప్రభుత్వం వారి నాయకుడైన శ్రీ అచ్యుత మీనన్ సారథ్యంలోనే నడిచింది. అలాగే పశ్చిమ బెంగాల్‌లో శ్రీ సిద్ధార్థ శంకర్ రేతోనూ, ఆంధ్రప్రదేశ్‌లో బ్రహ్మానందరెడ్డి, శ్రీ వెంగళరావు తోనూ కలసి ఆ రాష్ట్రాల్లోని కాంగ్రెసు పరిపాలనలో జరిగిన మూకుమ్మడి అత్యాచారాలకు, హత్యలకూ వీరు పాలు పంచుకొన్నారు. ఈ ఘోరమైన హింసాకాండకు తమకుగల బాధ్యత విషయమై వారేమాత్రం గుర్తించక పోవడం క్షమించరాని విషయం.

ఈ నాటికి కూడా ఈ మితవాద కమ్యూనిస్టు నాయకులు వెంగళరావు మంత్రివర్గాన్ని డిస్‌మిస్ చేయాలన్న డిమాండ్‌ను అంగీకరించడానికి సిద్ధపడటం లేదు. అలాగే ఘోరమైన అత్యాచారాలను జరిపిన తమ కేరళ మాజీ మంత్రు లను నిరసించి, వారితో సంబంధాలను తెంచుకోడానికి ముందుకు రావడం లేదు. మరోవైపున తమనేరాన్ని కప్పిపుచ్చుకొనేందుకుగాను తాము మొట్ట మొదటినుండీ నక్షలైట్ల విడుదలను డిమాండ్ చేస్తున్నామనీ, హత్యలను ఆపు

చేయమని కోరుతున్నామని ప్రజలముందు పోజులు పెట్టడానికి యత్నించుతున్నారు.

ప్రజాతంత్ర వాదులందరి కర్తవ్యం

నక్సలైట్లందరినీ విడుదల చేయాలనీ, వారు పునరాలోచన చేసుకొని, దేశంలో ప్రజాతంత్ర ఉద్యమంతో ఇమిడేందుకు అవకాశం యివ్వాలని డిమాండ్ చేయడం నేడు ప్రతిఒక్క ప్రజాతంత్రవాది యొక్క, పౌరహక్కులను అభిలషించే ప్రతి ఒక్కరియొక్క విధ్యుక్త ధర్మం. అలాగే అలాంటి పోలీసు అత్యాచారాలు, చిత్రహింసలు, హత్యలు ఇంక ముందెన్నడూ మన దేశంలో జరగకుండా చూడవలసిన ధర్మంకూడా ప్రజాస్వామ్య వాదులందరి పైనావుంది. ఇలాంటిదేమీ చేయకుండా మితవాద కమ్యూనిస్టు నాయకులు నేడు ఇతర పార్టీలపై దుష్ప్రచారం చేయడమే తమ కార్యక్రమంగా పెట్టుకొన్నారు. ఇలాచేయడమంటే ఈ అత్యాచారాలన్నింటికి పూర్తిబాధ్యత వహించవలసిన కాంగ్రెసు ప్రభుత్వానికి రక్షణ కల్పించడానికి యత్నించడం తప్ప మరొకటి కానేకాదు.

కాంగ్రెసు ప్రభుత్వం జరిపిన ఘోరమైన అత్యాచారాలకు దాని బాధ్యత లేకుండా తప్పించేందుకు తమ నాయకులు చేస్తున్న యీ ప్రయత్నాలను అవివేయించడానికి మితవాద కమ్యూనిస్టుపార్టీ కేడరూ అనుయాయులూ ముందుకు రావాలని నేను కోరుతున్నాను. అలాగే మనదేశంలో పౌరహక్కులను పూర్తిగా పునరుద్ధరించేందుకూ, అమానుషమైన పాశవికమైన అత్యాచారాలను సాగించిన వారందరిని శిక్షింపజేసేందుకూ జరిగే అందోళనా ఉద్యమాల్లో చిత్తశుద్ధితో కలసిరావలసిందిగా వారికి విజ్ఞప్తి చేస్తున్నాం.

కేరళలో హత్యాకాండలో అచ్యుతమీనన్ పాత్ర ఏమిటి ?

కామ్రేడ్ ఇ. యమ్. యస్. నంబూద్రిపాద్ సూటి ప్రశ్న

మార్క్సిస్టు కమ్యూనిస్టు నాయకుడు శ్రీ ఇ.యమ్.యస్. నంబూద్రిపాద్ జూన్ 27వ తేదీన ఢిల్లీనుంచి ఒక ప్రకటనచేస్తూ నేడు మొత్తం అచ్యుతమీనన్ ప్రభుత్వమే కేరళ ప్రజాభిప్రాయంలో బోనుఎక్కించబడి వుందని, మార్క్సిస్టుపార్టీపై ఎలాంటి నిందారోపణలను సాగించినా, అవి ఈ వాస్తవాన్ని మరుగు పరచజాలవని మితవాద కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యదర్శి వర్గం గుర్తించడం అవసరమని హెచ్చరిక చేశారు.

ఆయన ప్రకటనలో ఇంకా ఈ క్రింది అంశాలున్నాయి:

అచ్యుతమీనన్ ముఖ్యమంత్రిగా వున్న ప్రభుత్వంకింద రాష్ట్రంలో కల్లా అత్యంతసీనియర్ పోలీసుఆఫీసరైన పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ 'రబ్బరు స్టాంపు' గా తయారయ్యాడని కేరళ హైకోర్టులాంటి ఉన్నత న్యాయస్థానమే తన విచారణలో తెలుసుకొని ప్రకటించింది. అప్పుడు సహజంగానే ఒక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. పోలీసు ఇన్ స్పెక్టర్ జనరల్‌ను రబ్బరు స్టాంపుగా మార్చింది ఎవరు ? హెూం మంత్రి కరుణా కరనా ? లేక అగ్రశ్రేణికి చెందిన ముగురు మితవాద కమ్యూనిస్టు నాయకులున్న మొత్తంమంత్రివర్గమా ? కరుణా కరన్ మాత్రమే అందుకు బాధ్యుడైవుంటే, మరి ఆయనకు నాయకుడుగావున్న అచ్యుతమీనన్ పాత్రఏమిటి ? ఆయనకూడా హెూమ్ మంత్రికి 'రబ్బరు స్టాంపు'గా మారిపోయాడా ?

ఈ ప్రశ్నలను ఇప్పుడు ప్రతిపక్షంవారు మాత్రమే లేవదీయడం లేదు. ప్రఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ కె. యన్. రాజ్ ఈ ప్రశ్ననే లేవనెత్తారు.

ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి రాజన్ అరెస్టు చేయబడి చిత్రహింసలకు గురిచేసి చంపడానికి కొన్నిమాసాలకుముందే అధికారాన్ని దుర్వినియోగ పరచిన ఒకనిర్దిష్టమైన కొన్ని సంఘటనలను అచ్యుతమీనన్ దృష్టికి తీసుకొని వస్తూ డా॥ రాజ్ లేఖరాశారు. అందుకు ముఖ్యమంత్రి మీనన్ నుంచి ఆయనకు జవాబు వచ్చింది. అధికార దుర్వినియోగానికి సంబంధించిన ప్రతి ఒక్క సంఘటనను తనఅధ్యక్షతనుగల ఒకసబ్ కమిటీ పరిశీలించుతూవున్నదని శ్రీ మీనన్ ఆ జవాబులో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్ ఒక ఖచ్చితమైన ప్రశ్న వేస్తున్నారు. తనకుమారుడు రాజన్ విషయమై ప్రొఫెసర్ ఈ చరవారియర్ ప్రభుత్వ దృష్టికి తీసుకొని వచ్చారుకదా మరి అప్పుడు సబ్ కమిటీ ఆ కేసును పరిశీలించిందా ? ఆలా పరిశీలించివుంటే ఆ విషయమై సబ్ కమిటీ ఏమిచేసినట్లు ?

ఇంతవరకూ నోరుమెదపని అచ్యుతమీనన్

'రాజన్ కేసు' విషయమై గత కొద్ది వారాలుగా ఒక్క కేరళలోనే గాక మొత్తం దేశంలో బహుళ ప్రచారం జరుగుతున్నది. కాని ఆ ఘటన జరిగినప్పుడు అధికారంలో వున్న మంత్రి వర్గానికి అధిపతిగావున్న అచ్యుత మీనన్ ఇంతకాలంగా ఆ విషయమే నోరుమెదపకపోవడం అత్యంత ఆశ్చర్య కరంగావుంది. కొంతమంది విలేకరులు ఆయనను కలుసుకొని ఈ విషయమై

Check List

Book Number	DV/K02C227	**Date**	16-5-2022
Front Cover	NO	**Back Cover**	NO
Blank Pages	NO		
Missing Pages	1,2		
Prepared By	shameera	**Cutting By**	shameera
Scanned By	shameera	**Pages**	17